క్లుప్తంగా

నేటి నుంచి పాలిసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

నందిగామ: పాలిసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని నందిగామ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ కూలర్లు బహూకరణ

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి, ఎన్‌ఆర్‌ఐ గింజుపల్లి వినయ్‌శేషు తన తండ్రి వెంకటేశ్వరరావు(హరిదాసు) జ్ఞాపకార్థం రెండు వాటర్ ఫిల్టర్ కూలర్లను గురువారం హెచ్‌ఎం కె.జలజకు అందజేశారు. ఇప్పటికే లింగగూడెం గ్రామానికి చెందిన గుగులోతు ప్రేమలత చదువుకు ఇప్పటికే రూ.20 వేలు నాలుగేళ్లుగా అందిస్తున్న వినయ్‌శేషు తాను చదివిన పాఠశాలకు ఏ అవసరం వచ్చినా సహకరిస్తానని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయన్ను సత్కరించారు.

కోర్టు ప్రాంగణాలను సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



నందిగామ: ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక గురువారం సాయంత్రం నందిగామ పట్టణానికి వచ్చారు. ముందుగా పట్టణంలోని న్యాయస్థానాలను సందర్శించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవనాన్ని పరిశీలించారు. ఆ తరువాత క్వార్టర్స్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణసారిక మాట్లాడుతూ నూతన కోర్టు భవనాలు సెప్టెంబర్ 5 వ తేదీ నాటికి ప్రారంభించేలా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తి వెంట పట్టణంలోని జిల్లా 16 అదనపు కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు, పలు కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

కంచికచర్ల: ప్రతిఒక్కరూ చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని డాన్‌బోస్కో నవజీవన్ బాల భవన్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ మేరుగు రత్నం అన్నారు. మండలంలోని కునికెనపాడు గ్రామ సచివాలయంలో సర్పంచి బండారుపల్లి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది, పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్‌లు, వలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలాజీ, పాఠశాల హెచ్‌ఎం నండ్రు సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దురుసుగా ప్రవర్తించిన ఎండీయూ

కంచికచర్ల: మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందజేసే రేషన్ బియ్యంతో పాటు బెల్లం, రాగిపిండి సరుకులు ఇవ్వాలని ఎండీయూను స్కూల్ హెచ్‌ఎం అడగ్గా ఇవ్వను నీ ఇష్టం వచ్చినవాడికి చెప్పుకో అని దురుసుగా ప్రవర్తించిన సంఘటన మండలంలో గురువారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని గనిఆత్కూరు గ్రామ ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న వై.నాగభూషణం మధ్యాహ్న భోజన పథకం రేషన్‌బియ్యాన్ని తమ పాఠశాలకు ఇవ్వాలని రేషన్ వెహికిల్ డ్రైవర్ కె.జీవన్‌కుమార్‌ను ఈనెల 5వ తేదీ నుంచి అడుగుతూ వస్తున్నారు. ఎండీయూ మాత్రం నేను ఇవ్వను నీ యిష్టం వచ్చిన వాడికి చెప్పుకో అంటూ హెచ్‌ఎంపై దురుసుగా ప్రవర్తించాడు. రేషన్ బియ్యాన్ని ఈనెల 1వ తేదీ నుంచి 5వ తేదీలోగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ విషయం గురించి తహసీల్దార్ శంకరబాబుకు ఎండీయూపై ఫిర్యాదు చేశానని, విచారణ చేపట్టి ఎండీయూపై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారని హెచ్‌ఎం తెలిపారు.

నాయీ బ్రాహ్మణుల నిరసన

నందిగామ: జేసీ ప్రభాకర్ రెడ్డి నాయీ బ్రాహ్మణులపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం నందిగామ పట్టణంలో నాయీ బ్రాహ్మణులు నిరసన తెలిపారు. ఓ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జేసీ ప్రభాకర్ రెడ్డి నాయీబ్రాహ్మణులను కించపరిచే విధంగా మాట్లాడారని మండిపడ్డారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు దాసు జయరాం, అన్నవరపు గణపతి రావు, నటరాజ్,శ్రీను,నరసింహారావు పాల్గొన్నారు.

డ్రైన్ నిర్మాణ పనుల పరిశీలన

జగ్గయ్యపేటఅర్బన్: వార్డు పర్యటనలో భాగంగా గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ స్థానిక 6 వ వార్డులో జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు.

చిరకాల వాంఛ సాకారం చేసిన సీఎం జగన్

నందిగామటౌన్: నందిగామ ప్రజల చిరకాల వాంఛను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. నందిగామ పట్టణంలో నిర్మించనున్న 100 పడకల ఆస్పత్రి స్థలాన్ని నాబార్డు ప్రతినిధులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా 100 పడకల ఆస్పత్రి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విజయం సాధించిన తరువాత 100 పడకల ఆస్పత్రి ఆవశ్యకతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేయటమే కాకుండా రూ.35 కోట్ల నిధులను సైతం మంజూరు చేశారని గుర్తు చేశారు. నందిగామ పరిసర ప్రాంత ప్రజలు వైద్యం కోసం 50 కి.మీ మేర ప్రయాణం చేసి విజయవాడ వెళ్లాల్సి వస్తోందని ఆస్పత్రి నిర్మాణంతో ప్రజల అవస్థలు తీరుతాయన్నారు. అనంతరం నాబార్డు ప్రతినిధులు, వైద్యారోగ్య శాఖాధికారులు స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, మారం అమరయ్య, బండారు వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



వంద పడకల ఆస్పత్రి స్థలాన్ని పరిశీలిస్తున్న నాబార్డు ప్రతినిధులు, ఎమ్మెల్సీ అరుణకుమార్

తక్కువ నీటితో చిరుధాన్యాలు, అపరాల సాగు



బత్తినపాడులో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

జిల్లా వనరుల కేంద్ర డీడీఏ మాధవీలత

బత్తినపాడు(కంచికచర్ల): తక్కువ నీటితో చిరుధాన్యాలు, అపరాల పంట సాగుచేసుకోవాలని, ఎరువులను కూడా డ్రిప్ విధానంతో అందించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ టి.మాధవీలత అన్నారు. మండలంలోని బత్తినపాడు గ్రామంలో గురువారం గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా రైతులు సాగుచేసిన పలు రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన ఉత్పత్తిలో మెలకువలను పాటించాలన్నారు. ఐసులేషన్ దూరం గురించి రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వేప, తులసి, కరివేపాకు తదితర పంటలను కూడా సాగు చేయాలని సూచించారు. విత్తన ఉత్పత్తి, జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత, విత్తన తేమ, మొలక శాతం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ మోనిషా, నందిగామ ఏడీఏ కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, వీఏఏలు శ్రీనివాసరావు, రఘు, హనీఫ్, మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందులు పంపిణీ

వీరులపాడు: విద్యార్థులు విధిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆయన నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు అందజేస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్

ముక్త్యాలలో...

ముక్త్యాల(జగ్గయ్యపేట): పిల్లల్లో ఎక్కువగా నులి పురుగులుంటాయని, వీటి వల్ల రక్తహీనత, నీరసం, కడుపు నొప్పి వంటి సమస్యలతో ఇబ్బందులు పడకుండా ప్రతి విద్యార్థి నులి పురుగుల నివారణ మందులు వినియోగించాలని బూచవరం వైద్యాధికారి అనిల్‌కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగులున్న చిన్నారుల్లో ఎదుగుదల లోపం తలెత్తుతోందన్నారు. అంతే కాకుండా రాత్రి వేళల్లో నిద్ర లేకుండా చేయటంతో పాటు ఏకాగ్రత కోల్పోతారని తెలిపారు. మండలంలోని 21 సచివాలయాల్లోని 87 అంగన్‌వాడీ కేంద్రాల్లో 48 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకట్రావ్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆనకట్టకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలి

పోలంపల్లి(వత్సవాయి): పోలంపల్లి వద్ద మునేటి కాలువ ఆనకట్టకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. వరదతాకిడికి కొట్టుకుపోయిన ఆనకట్టను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునేటికి ఎగువ ప్రాంతాలైన తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో మునేటికి వరద కూడా అంతేస్థాయిలో వచ్చిందని వరద తాకిడికి ఆనకట్ట సుమారు 20 మీటర్ల వరకు కొట్టుకుపోయిందన్నారు. ఈ ఆనకట్ట వల్లనే మునేటి కాలువకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కాలువ కింద 26 వేల ఎకరాల వరకు సాగు ఉందని తెలిపారు. ఈ కాలువ కింద రైతులు వరినాట్లు వేసుకునేందుకు నార్లు పోసుకుని సిద్ధంగా ఉన్నారని, ఆనకట్టకు మరమ్మతులు నిర్వహిస్తేనే నీరు నిల్వ ఉండి కాలువకు నీరు వస్తుందని, ప్రభుత్వం వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, కౌలురైతు సంఘ కార్యదర్శి చనుమోలు సైదులు, రైతు సంఘ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, జిల్లా కమిటీ సభ్యులు మండేపూడి చంద్రశేఖర్, మండల రైతు సంఘ నాయకులు తమ్మినేని రాంబాబు, రమేష్, కంచర్ల కొండయ్య, బి.రాము, దారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10 దుకాణాలు సీజ్ చేసిన దేవదాయ అధికారులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని స్థానిక గాలిమిషన్ రోడ్‌లో ఉన్న బ్రహ్మానంద స్వామి వారి మఠంకు సంబంధించిన ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర దేవదాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం పట్టణానికి వచ్చిన దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి ముందుగా షాపులకు సంబంధించి విచారణ చేపట్టారు. అనంతరం ఆమె ఆదేశాల మేరకు ఎండోమెంట్ అధికారులు, సిబ్బంది ప్రభుత్వ నిబంధనలు పాటించని బ్రహ్మానందస్వామి వారి మఠంకు చెందిన 10 షాపులకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీ శాంతి మాట్లాడుతూ జగ్గయ్యపేటలోని బ్రహ్మానంద స్వామి వారి మఠంకు చెందిన 10 దుకాణాలకు 2020 లోనే లీజు సమయం పూర్తయిందని, అయినప్పటికీ లీజుకు తీసుకున్న వారు అద్దెలు చెల్లించక పోగా, షాపులను ఖాళీ చేయడం లేదన్నారు. షాపులపై బినామీల పెత్తనం నడుస్తోందని, తక్కువ ధరకు లీజుకు తీసుకొని ఎక్కువ ధరకు బినామీలకు లీజుకు ఇస్తున్నారని తెలిపారు. వీరంతా షాపులకు లీజు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో షాపులకు ఓపెన్ ఆక్షన్ పెట్టి లీజుదారులను నిర్ణయించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని పలు దేవాలయాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు వాటిని కూడా పరిశీలిస్తామని దేవదాయ శాఖ ఏసీ శాంతి తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ఈవోలు జయప్రకాష్, హరిదుర్గానాగేశ్వరరావు, వేదాద్రి దేవస్థానం, పేటలోని దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



నిబంధనలు పాటించని దేవస్థాన షాపులను సీజ్ చేయిస్తున్న దేవస్థాన జిల్లా ఏసీ శాంతి

రాష్ట్రంలో పారదర్శక పాలన

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధితో పాటు రాష్ట్రంలో అవినీతి రహిత పారదర్శక పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.



జుజ్జూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గాంధీ సెంటర్ అభివృద్ధికి సహకరించాలి

అఖిలపక్ష సమావేశంలో ఎమ్మెల్సీ అరుణకుమార్



నందిగామటౌన్: నందిగామ నియోజకవర్గానికి కేంద్ర బిందువుగా ఉన్న గాంధీ సెంటరును అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలన్న తమ లక్ష్యానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ విజ్ఞప్తిచేశారు. గాంధీ సెంటర్‌లో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి హైకోర్టు తీర్పుపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ సెంటరులో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి కొందరు కోర్టును ఆశ్రయించటంతో స్టే ఇచ్చిన హైకోర్టు 17 నెలల తరువాత స్టేను కొట్టి వేస్తూ మూడు అంశాలతో కూడిన తీర్పును వెలువరించిందన్నారు. గాంధీ సెంటరులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించకుండా గాంధీ సెంటర్‌లోని సర్కిల్ పరిసరాలలో ఉన్న విగ్రహాలను పక్కకు ఏర్పాటు చేయాలని కోర్టు సూచించిందన్నారు. విగ్రహాల ఏర్పాటులో ఏ ఒక్క రాజకీయ, మహనీయుల విగ్రహాలను తక్కువ చేసి చూసే ప్రసక్తే లేదని తెలిపారు. విగ్రహాల ఏర్పాటును అందరి ఆమోదంతోనే ఏర్పాటు చేయాలని వేచి ఉన్నామని చెప్పారు. రాజకీయాల కోసం అభివృద్ధిని అడ్డుకోవద్దని కోరారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైస్ చైర్పర్సన్ మాడుగుల నాగరత్నం మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, అఖిలపక్ష నాయకులు టొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, గుడివాడ సాంబశివరావు, స్వర్ణలత, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ సమస్యపై స్పందించిన చైర్మన్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జేఆర్సీ కళాశాల దగ్గరలో ఉన్న మురుగు కాలువ మడుగు సమస్యపై సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర స్పందించారు. ఈ సందర్భంగా గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రాగల 20 రోజుల్లో ఈ సమస్య పూర్తి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమస్యపై నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ సిబ్బంది డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ డి.హనుమంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.దుర్గాప్రసాద్‌లను మందలించారు.

అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

పెనుగంచిప్రోలు: అమర వీరులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. మండలంలోని సుబ్బాయిగూడెం, కొళ్లికూళ్ల, ముచ్చింతాల గ్రామాల్లో గురువారం 'నా భూమి–నాదేశం–వీరులకు వందనం' ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా పాఠశాలల్లో శిలాఫలకం ఆవిష్కరణ, ప్రతిజ్ఞ, మొక్కలు నాటటం, కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాపినేని వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ కిషోర్, జక్కులూరి రాంబాబు, ఏపీఓ తిరుపతయ్య, ఎస్సీ నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగంలో పెనుమార్పులు

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): జగనన్న పాలనలో రాష్ట్రంలో విద్యారంగంలో పెనుమార్పులు వచ్చాయని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. స్థానిక యూపీ పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న కార్యక్రమాలు మరే రాష్ట్రంలో అమలు జరగటం లేదన్నారు. అనంతరం గ్రామానికి చెందిన కొలకాని జ్యోతి, దుర్గారావు దంపతులు విద్యార్థులకు టైలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కులూరి రాంబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆళ్ల బాలకృష్ణ, హెచ్‌ఎం ఆర్.కనకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళాలు పగలగొట్టి రూ.20 వేలు చోరీ

మక్కపేట(వత్సవాయి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగలగొట్టి రూ.20 వేల నగదును చోరీ చేసిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఏలూరి శాంతలక్ష్మి రెండు రోజులపాటు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేరని గమనించి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.20 వేలను దొంగిలించారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన శాంతలక్ష్మి ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్‌ఐ బి.అభిమన్యు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన జెడ్పీటీసీ నాగమణి, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి

పెనుగంచిప్రోలు: అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మండల వ్యవసాయాధికారి సరిగా స్పందించటం లేదని, తగిన వివరాలతో సమావేశానికి రావటం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెట్లు మొలిచి దారుణంగా ఉంటున్నాయని దీనిపై విద్యాశాఖ అధికారులు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అధికారులు ఎవరూ పట్టించుకోక పోతే ఎలా అని ప్రశ్నించారు. వీటిపై ఎంపీపీ మాట్లాడుతూ తక్షణం వీటిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు అభివృద్ధిలో దూసుకు పోతున్నాయన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా ఇబ్బందులను అధికారులు తక్షణం పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో క్రీడాకారుల ఎంపిక జరగాలన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించి ఇంటింటికీ వస్తున్న బీఎల్‌ఓలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, వైద్యాధికారి ఇందిర, ఎంఈఓ రవీంద్ర, పశువైద్యాధికారి అనిల్, ఏఓ కె.రామసుబ్బారెడ్డి, పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఏపీఓ తిరుపతయ్య, ఏపీఎం రాజారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద మోదుగపల్లి సర్పంచ్ పదవికి 3 నామినేషన్లు



తులశమ్మకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి రాజు



దాచవరం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న గద్దె వెంకటేశ్వర్లు

వత్సవాయి: మండలంలోని పెద్దమోదుగపల్లి సర్పంచ్, శింగవరం ఆరో వార్డు సభ్యులు ఇటీవల మరణించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 19 న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం పెద్దమోదుగపల్లి సర్పంచ్ పదవికి ముగ్గురు వ్యక్తులు, శింగవరం ఆరోవార్డుకు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ చెన్నారావు తెలిపారు.

నాలుగవ వార్డు ఉప ఎన్నికకు నామినేషన్

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): గ్రామంలోని నాలుగవ వార్డు ఉప ఎన్నికకు ఒక నామినేషన్ వచ్చినట్లు ఎంపీడీవో ప్రసాద్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన కందిబండ వసంత నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. వార్డు సభ్యుడు కందిబండ ఆంజనేయులు గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ప్రస్తుతం ఉప ఎన్నిక జరగనుంది.

6వ వార్డుకు ఉప ఎన్నిక ఏకగ్రీవం

పెనుగంచిప్రోలు: మండలంలోని పెనుగంచిప్రోలు 6వ వార్డుకు చివరి రోజు గురువారం కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే రావటంతో ఎన్నికల అధికారి రాజు పిడిమర్తి తులశమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువపత్రం అందజేశారు. లింగగూడెం రెండవ వార్డుకు కూడా ఒకే వర్గానికి చెందిన వారు రెండు నామినేషన్లు వేశారు. వారిది కూడా ఏకగ్రీవం కానుంది. అభ్యర్థులు మరణించిన చోట జరిగే ఉప ఎన్నికల్లో అభ్యర్థులను నిలపకూడదనే తమ అధిష్టానం నిర్ణయం మేరకు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను పోటీ చేయించలేదని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి తెలిపారు.

8వ వార్డుకు మూడు నామినేషన్లు

నందిగామ: మండలంలోని తొర్రగుడిపాడు 8 వ వార్డుకు సంబంధించి గురువారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. వంగల నాగమణి ఒక నామినేషన్, మోర్ల కల్పన రెండు నామినేషన్లు దాఖలు చేశారని, వచ్చిన నామినేషన్లకు శుక్రవారం 8 గంటల నుంచి స్క్రూటినీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

దాచవరం సర్పంచ్ అభ్యర్థిగా గద్దె నామినేషన్

వీరులపాడు: మండలంలోని దాచవరం గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థులు గురువారం నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లెల ఝాన్సీరాణి తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి గద్దె వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక గ్రామ సచివాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ బలపర్చిన అభ్యర్థిగా తోట రవిబాబు, జనసేన పార్టీ అభ్యర్థిగా కామిశెట్టి వెంకటేశ్వరరావులతో పాటు మరో ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. దొడ్డదేవరపాడు ఆరో వార్డుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి అద్దంకి బేబి నామినేషన్ దాఖలు చేశారు.

పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి

హస్తకళల సేవా కేంద్రం ఏడీ అపర్ణలక్ష్మి

కంచికచర్ల: పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని, అటువంటి వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని విజయవాడ హస్తకళలు సేవా కేంద్ర అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అపర్ణలక్ష్మి అన్నారు. కంచికచర్లలో గురువారం డెవలప్‌మెంట్ కమిషనర్, హస్తకళలు, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో జరిగిన ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ఆమె మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ఉన్నత చదువులు చదివిన యువత ముందుకు రావాలని, ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 16వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అమర్లపూడి శేఖర్ బాబు, హోప్ ఫౌండేషన్ ట్రస్టీ బెన్‌హర్, హస్తకళల అభివృద్ధి అధికారి ఎం.సువర్చల, ఆప్కో ప్రోగ్రామింగ్ అధికారి పి.సుధీర్‌కుమార్, సెంట్రల్ బ్యాంకు మేనేజర్ మైఖేల్, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.



ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న అపర్ణలక్ష్మి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వీరులపాడు: గ్రామ పంచాయతీ నామినేషన్‌ల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్ హెచ్చరించారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత ధోరణిలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, సిబ్బంది పాల్గొన్నారు.